నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 20 జూన్ 2024 | SURYAPET

హుజూర్‌నగర్‌లో ఐటీఐ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రంలోని 65 ఐటీఐ కళాశాలల అప్‌గ్రేడ్‌కు రూ.2,324 కోట్లు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల/హుజూర్‌నగర్/హుజూర్‌నగర్ రూరల్/చింతలపాలెం/చిలుకూరు జూన్ 19 : రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద రూ.40 కోట్ల వ్యయంతో ఐదెకరాల స్థలంలో నిర్మించనున్న ఐటీఐ కళాశాల పనులకు బుధవారం నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 65 ఐటీఐ కళాశాలల అప్‌గ్రేడ్‌కు ప్రభుత్వం రూ.2,324 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 76,900 మంది నిరుద్యోగులు ఉపాధి శిక్షణ తీసుకుంటున్నట్లు చెప్పారు. పదో తరగతితోపాటు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్‌లో 32 కోర్సుల్లో ప్రభుత్వం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి హుజూర్‌నగర్‌లో ఐటీఐ కళాశాల ఏర్పాటు ఎంతో ఉపయోగ పడనుందన్నారు. రానున్న అక్టోబర్, నవంబర్ నాటికి 2,160 సింగిల్ బెడ్రూం ఇండ్లను పేదలకు పంపిణీ చేస్తామన్నారు. డిగ్రీ కళాశాల అప్‌గ్రేడ్, రింగ్ రోడ్డు, ప్రధాన రహదారి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో లిఫ్టులను ఆధునీకరించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం హుజూర్‌నగర్ మండలం లింగగిరి నుంచి యాతవాకిళ్ల వరకు రూ. 20కోట్లతో నిర్మించనున్న నూతన రోడ్డు, విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే చింతలపాలెం మండలం దొండపహాడ్‌లో రూ.20 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు, చిలుకూరులోని కోదాడ-జడ్చర్ల రహదారి నుంచి మండల పరిధిలోని బేతవోలు, జెర్రిపోతులగూడెం రోడ్డు విస్తరణ పనులకు, నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద రూ.20 కోట్లతో చేపట్టనున్న చిల్లేపల్లి-సోమారం రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అడిషనల్ కలెక్టర్ ప్రియాంక, ఆర్డీఓ శ్రీనివాసులు, ఉపాధి శిక్షణ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, తాసీల్దార్ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ గెల్లి అర్చనారవి, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, కొట్టె పద్మాసైదేశ్వర్ రావు,బండ్ల ప్రశాంతి, జడ్పీటీసీ బొలిశెట్టి శిరీష, కాంగ్రెస్ చింతలపాలెం మండలాధ్యక్షుడు నరాల కొండారెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- జిల్లా కేంద్ర దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ నారాయణరెడ్డి
- రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వార్డు బాయ్స్ సస్పెన్షన్

నీలగిరి, జూన్ 19 : నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడో రోజే సి.నారాయణరెడ్డి కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వార్డు బాయ్స్‌ను సస్పెండ్ చేయడంతోపాటు విధులకు గైరాజరైతే కఠిన చర్యలు తప్పవని డాక్టర్లను సైతం హెచ్చరించారు. జిల్లా కేంద్ర దవాఖానను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ, ఐసీయూ, పాలియేటివ్ కేర్, మేల్, ఫిమేల్ వార్డులు, సర్జికల్, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ఎంసీహెచ్ వార్డులన్నింటినీ కలియతిరిగారు. ఆయా వార్డుల్లో రోగుల బంధువులతో ముఖాముఖి మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని, 5 రూపాయల భోజనం ఇస్తున్నారా?, తాగునీరు ఎలా ఉంది, టాయిలెట్లు బాగున్నాయా తదితర వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేల్ సర్జికల్ వార్డులో ప్రతి పనికి డబ్బులు అడుగుతున్నారని రోగుల సహాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన తీవ్రంగా స్పందించారు. పేదలు మాత్రమే ప్రభుత్వాస్పత్రికి వస్తారని, ఆపదతో వస్తే డబ్బులు అడుగుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు అడిగిన ఇద్దరు వార్డ్ బాయ్‌లను సస్పెండ్ చేశారు. డ్యూటీ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది ఆయా వార్డులు, షిఫ్టులవారీగా పనిచేసే వారి వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడుగడమే కాకుండా హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది కేటాయించిన షిఫ్టుల్లో ఉండాలని, లేకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించడానికి సైతం వెనుకాడబోమని తెలిపారు. పని చేస్తేనే ఆస్పత్రిలో ఉండాలని, లేకుంటే ఉద్యోగం వదిలి వెళ్లిపోయినా తమకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. వార్డులన్నింటినీ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య సిబ్బంది, కాంట్రాక్టర్‌కు తెలిపారు. ఆయన వెంట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నిత్యానంద్, ఆర్ఎంఓ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

బాధితుడితో మాట్లాడుతున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జూన్ 19 : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. పోలీస్ గ్రీవెన్స్‌లో భాగంగా బుధవారం ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఫిర్యాదుదారుడి వినతి పరిశీలించి సమస్యలపై చట్ట పరిధిలో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యలపై నిర్భయంగా తన కార్యాలయానికి రావాలని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

భారీగా తంబాకు ప్యాకెట్లు పట్టివేత

- రూ.2 లక్షల విలువ గల 420 బాక్సులు స్వాధీనం
- డీసీఎం సీజ్

కోదాడ రూరల్, జూన్ 19 : భారీగా తరలిస్తున్న తంబాకు ప్యాకెట్లను కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధి నల్లబండగూడెం శివారు రామాపురం క్రాస్‌రోడ్డు సమీపంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వాహన తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వైజాగ్ నుంచి నల్లగొండ పట్టణానికి రాజస్థాన్‌కు చెందిన మీనామనోహర్‌లాల్ తన డీసీఎం కంటైనర్‌లో తరలిస్తున్న తంబాకు 420 బాక్సులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటి మార్కెట్ విలువ సుమారు రూ.2.12 లక్షలు ఉంటుందని తెలిపారు. పరిశీలన కోసం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పంగించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

బదిలీల్లో అడ్డదారులపై అధికారుల నిఘా..!

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన స్కూల్ అసిస్టెంట్ల జాబితాల పరిశీలన

రామగిరి, జూన్ 19 : ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా నల్లగొండ జిల్లాలో అడ్డదారిలో తప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్ దరఖాస్తుల్లో నమోదు చేసి సీనియార్టీ దక్కించుకున్న అంశంపై విద్యాశాఖ అధికారులు నిఘా పెట్టారు. 'నమస్తే తెలంగాణ'లో బుధవారం ప్రచురితమైన 'బదిలీల కోసం అడ్డదారులు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆ శాఖ అధికారులు స్పందన షురూ చేసినట్లు సమాచారం. అయితే ఎక్కడ..? ఏ మండలంలో ఉన్నారనే అంశంపై ఆన్‌లైన్‌లో ఆయా విభాగాల్లో ఉపాధ్యాయులు నమోదు చేసిన అంశాలు, ఫిజికల్‌గా డీఈఓ కార్యాలయంలో ఉన్న అంశాలపై మళ్లీ ఫైల్స్ తిరిగేస్తున్నట్లు తెలిసింది. ఆయా మండలాల్లోని ఎంఈఓలకు సైతం సమాచారం చేరవేసి పునఃపరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై డీఈఓ భిక్షపతిని నమస్తే తెలంగాణ వివరణ కోరగా.. ఆయా విభాగాల్లో బదిలీలకు దరఖాస్తు చేసిన ఉపాధ్యాయుల వివరాలను తిరిగి పరిశీలిస్తామన్నారు. తప్పుడు సమాచారం నమోదు చేసినట్లు రుజువైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కరెంట్ అంటేనే కేసీఆర్!

- అన్ని కేటగిరీలకు నిరంతర విద్యుత్
- నాణ్యమైన కరెంట్ సరఫరాకు ప్రాధాన్యం
- రాష్ట్రం పట్ల చిత్తశుద్ధితోనే సాధ్యమైంది
- విద్యుత్ వెలుగులపై ప్రజల మనోగతం

ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్‌తోనే కరెంట్ కష్టాలకు చెక్

నల్లగొండ ప్రతినిధి, జూన్19(నమస్తే తెలంగాణ) : సమైక్య పాలనలో కరెంట్ అంటేనే కన్నీటి వ్యథలకు రూపం. మూడు గంటలిస్తే ఆరు గంటల కోతలు. ఇచ్చిన దానిలోనూ సింగిల్ ఫేజే ఎక్కువ సమయం. ఇక త్రీఫేజ్ కరెంట్ ఇస్తే దఫదఫాలుగా వచ్చేది. దాంతో పొలం వద్ద ఉన్న రైతులకు కంటి మీద కునుకు ఉండేది కాదు. కార్కానాల ఉండే కార్మికుడికి పని దొరికేది కాదు. ఇక కరెంట్ మీద ఆధారపడే చిరు వ్యాపారస్తులకు చుక్కలు కనిపించేవి. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి కాంగ్రెస్ పాలకుల కరెంట్ సరఫరా ఇట్లుంటదని కేసీఆర్ అప్పుడే చెప్పారు. కోతలు లేని నాణ్యమైన కరెంట్ రాష్ట్రం సాధించాక తెచ్చుకుందామంటూ ప్రజలకు మాటిచ్చారు. అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి సీఎంగా కేసీఆర్ విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రానికి అవసరమైన కరెంట్‌పై ప్రణాళికలు సిద్ధం చేశారు. ఓ వైపు రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లపై దృష్టి సారిస్తూనే తక్షణమే కరెంట్ ఇబ్బందులకు చెక్ పెట్టేలాగా ఇతర రాష్ట్రాల నుంచి కరెంట్ తెచ్చుకునేలా మరోవైపు కేంద్రీకరించి పనిచేశారు. వీటన్నింటి ఫలితంగానే ఉద్యమ సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడుతూ 2018 జనవరి 1 నుంచి వ్యవసాయానికి నిరంతరం ఉచిత విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. గృహావసరాలకు, తర్వాత పరిశ్రమలకు సైతం 24 గంటల కరెంట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇలా ఇచ్చే కరెంట్‌లోనూ తరుచూ అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన కరెంట్ వివిధ వర్గాల ప్రజలకు అందించేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఓహెచ్ లైన్ల విస్తరణ, ఎల్‌టీ లైన్ల నిర్మాణం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల వంటివాటి కోసం ఒక్క నల్లగొండ జిల్లాలోనే సుమారు రూ.1100 కోట్లను వెచ్చించారు. దాంతో గృహ, వ్యవసాయం, పరిశ్రమలకు సైతం నిరంతరం నాణ్యమైన కరంట్ సరఫరా జరిగింది. ఎక్కడన్నా సాంకేతిక సమస్యలు మినహా విద్యుత్ కోతలు ఉండేవి కావు. పరిశ్రమల్లో మూడు షిఫ్టుల్లో పనిచేసినా ఇబ్బందిలేకుండా కరెంట్ ఇవ్వడంతో ఉపాధి అవకాశాలు విస్తృతమయ్యాయి. కుటీర, మధ్యతరహా, భారీ పరిశ్రమలు నిరంతరం పనిచేసేందుకు కరెంట్ దోహదపడింది. దాంతో సమైక్య పాలన నాటి చీకట్లు తొలగి ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసరించేలా కేసీఆర్ అవలంబించిన విద్యుత్ విధానాలు ఉపకరించాయనడంలో సందేహం లేదు. అందుకే ప్రజల్లో సైతం కరెంట్ అంటే కేసీఆర్... కేసీఆర్ అంటే కరెంట్ అనేంత క్రేజ్ వచ్చింది. అట్లాంటి కేసీఆర్ ప్రారంభించిన నిరంతర కరెంట్‌కు మరకలు రుద్దే ప్రయత్నాలు జరుగుతుండడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేసీఆర్‌పై కరెంట్ అభాండాలు వేసేలా కుట్రలు జరుగడం సరికాదంటున్నారు. కాంగ్రెస్ పాలకులు వీలైతే అంతకు మించి మరింత సమర్థవంతంగా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేసి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హితవు పలుకుతున్నారు. అంతేకానీ దేశంలోనే ఎక్కడా వీలుకాని విధంగా అన్ని రంగాలకు నిరంతర కరెంట్ సరఫరా ఇచ్చి సరికొత్త చరిత్ర లిఖించిన కేసీఆర్‌పై కక్ష్య సాధింపు సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

24 గంటల కరెంటుతో మిల్లులు మెరుగుపడ్డాయి

సమైక్య పాలనలో చిన్నతరహా పరిశ్రమల పరిస్థితి అధ్వానంగా ఉండేది. యువత బ్యాంక్ రుణాలు తీసుకొని మండలంలో పాలిష్, ముగ్గుమిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. 2014కు ముందు కరెంటు కష్టాలు విపరీతంగా ఉండేవి. రోజుకు 6 గంటలు కూడా కరెంటు వచ్చే పరిస్థితి లేకుండె. వారానికి ఒకరోజు హాలిడే ప్రకటించారు. మిల్లుల్లో పనిచేసే కార్మికులకు పని లేకుండా పోయింది. కరెంటు సరిగా లేక మిల్లులు మూతపడేస్థితికి చేరాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 24గంటల కరెంటు ఇవ్వడంతో మిల్లులు మెరుగుపడ్డాయి. కరెంటు కోతలు లేకుండా రోజంతా మిల్లులు నడిచాయి. నాటి కరెంటు కరువు పరిస్థితుల నుంచి చిన్న పరిశ్రమలకు కరెంటు ఇచ్చి ఆదుకున్న కేసీఆర్‌ను నేడు నిందించడం సరికాదు.

-పడిగెపాటి శ్రీనివాస్‌రెడ్డి, పాలిష్‌మిల్ యజమాని, దామరచర్ల

కేసీఆర్‌ను నిందించడం కరెక్ట్ కాదు

కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను బద్నాం చేయడం సరి కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు అరిగోసలు పడేవారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతుల గోడు తీర్చేందుకు 24 గంటల నిరంతర కరెంట్ సరఫరా చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలన రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్‌ను నిందించడం కరెక్ట్ కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కొలువైన నాటి నుంచి ఇప్పటివరకు రోజులో కనీసం 15 గంటల త్రీఫేజ్ కరెంటు ఇచ్చిన దాఖలాలు లేవు. కేసీఆర్ మాత్రం చిన్న, సన్నకారు రైతులతోపాటు పరిశ్రమలకు ఇబ్బందులు కలుగకుండా కరెంట్ సప్లయ్ చేశారు. అలాంటి కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు బురదజల్లడం సరి కాదు.

- వల్లమల్ల బాలస్వామి, రైతు, మొల్కపట్నం, వేములపల్లి మండలం

బీఆర్ఎస్ పాలనలో 24 గంటలు కరెంట్ వచ్చేది

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేండ్ల కాలంలో 24 గంటలపాటు కరెంట్ ఉండేది. చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా లభించేది. ఆ సమయంలో మాకు బోర్ల రిపేర్ గిరాకీ తక్కువగా ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మోటర్ రిపేర్ల గిరాకీ పెరిగింది. కరెంట్ సరైన సమయంలో రాకుండా ఉండడం, అలాగే అధికారులకు అవగాహన లేకకుంటలు, చెరువులను నింపకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోర్లు పోయక మోటర్లు కాలిపోతున్నాయి. సరైన సమయంలో కరెంట్ ఇవ్వకపోవడంతో మోటర్లు కాలిపోయి రిపేర్ల గిరాకీ పెరిగింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి దేశానికి వెన్నెముక అయిన రైతుల సమస్యలను పరిష్కరించాలి.

-కోదాటి నరేందర్, మోటర్ మెకానిక్, కుక్కడం, మాడ్గులపల్లి మండలం

కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెల్వట్లే..

మా గ్రామం ఎన్‌హెచ్-565పై ఉండడంతో రోడ్డు వెంటనే బైక్ సర్వీసింగ్‌తో పాటు పంచర్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నా. కరెంట్ ఉంటేనే నా పని సాగుతుంది. కేసీఆర్ పాలనలో 24 గంటలపాటు కరెంట్ ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెల్వట్లేదు. రోజులో పదిసార్లు కరెంట్ పోతుంది. కరెంట్ ఉన్నంత సేపు బైక్ సర్వీసింగ్, వాటర్ సర్వీసింగ్ చేస్తున్నా. కరెంటు సరిగా ఉండకపోవడంతో పంచర్ల గిరాకీ కూడా తగ్గి ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ పూర్తిస్థాయిలో ఉండకపోవడంతో బతుకు భారంగా మారింది. ఇప్పటికైనా 24గంటల కరెంటు ఉండేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలి.

- నారగోని జానయ్య, బైక్ మెకానిక్, చిన్నసూరారం, నల్లగొండ మండలం

ఆరు నెలలైనా అమలు కాని కాంగ్రెస్ హామీలు

దేవుళ్లపై ఒట్లు వేసి మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

నకిరేకల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్

- ఏడాదికి ఎకరాకు రూ.15 వేల రైతు బంధు హామీ ఏమైంది?
- డిసెంబర్ 9న రుణమాఫీ అమలు వాగ్దానం ఎక్కడ పోయింది?
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, జూన్ 19 : దేశంలో ఏ ప్రజాప్రతినిధి గానీ, సీఎంలు గానీ దేవుళ్లపై ప్రమాణం చేయలేదని, కేవలం రేవంత్‌రెడ్డి ఒక్కడే దేవుళ్లపై ఒట్లు పెట్టి వారిని కూడా మోసం చేశాడని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎద్దేవా చేశారు. నకిరేకల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ ఎక్కడ పోయిందని విమర్శించారు. ఏడాదికి ఎకరాకు రూ.10 వేలు ఉన్న రైతుబంధు రూ.15వేలు చేస్తానని ఇచ్చిన హామీ ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలలైనా ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. 70శాతం మందికి బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రూ.99వేల వరకు రుణమాఫీ చేశామని, మరో 30శాతం మందికి మాత్రమే రుణమాఫీ మిగిలిందని, వారికి మాఫీ చేసేందుకు మంత్రులతో, అధికారులతో పత్రికల్లో ఆగస్టు లోపు మాఫీ చేస్తామని రాయించడం తప్ప ఆచరణలో లేదన్నారు. అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, హోంగార్డులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఆంక్షలు పెడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్సే అన్నారు. రైతు రాజులాగా బతకాలని సీజన్ ప్రారంభం కాకముందే పెట్టుబడి సాయం ఎకరాకు రూ.5 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. 24 గంటల కరెంటుతోపాటు ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసే ప్రక్రియ చేపట్టి వ్యవసాయానికి పెద్దపీట వేసిన ఘనత ప్రపంచంలో కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు పెట్టకుండా ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై ఏ విధంగా కేసులు పెట్టాలి, జైలుకు ఎలా పంపాలనే ఆలోచన తప్ప కాంగ్రెస్‌కు మరొకటి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్యుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పిటిషన్ ఇచ్చే పరిస్థితి లేదని, 100కు డయల్ చేసినా ఫలితం లేదని, ఏ ఊరు నుంచి అయితే ఫోన్ వస్తుందో.. ఆ ఊరి కాంగ్రెస్ లీడర్‌ను అడిగి రావాలా? వద్దా ? అన్న ఆలోచనలో పోలీస్ యంత్రాంగం ఉందన్నారు. పోలీస్ స్టేషన్ బయటనే ఫొటోలు తీసుకుని ఏ పార్టీ అని అడిగి లోపలికి రానిచ్చే పరిస్థితి నకిరేకల్‌లో ఉందన్నారు. అధికార పార్టీకి తొత్తులుగా మారి న్యాయాన్ని అన్యాయం చేయొద్దన్నారు. నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఏ విధమైన అరాచకాలు సాగుతున్నాయో చూడాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నకిరేకల్, కేతేపల్లి మండలాల అధ్యక్షుడు నవీన్‌రావు, వెంకట్‌రెడ్డి, నాయకులు నడికుడి వెంకటేశ్వర్లు, రాచకొండ వెంకన్న, గుర్రం గణేశ్, దైద పరమేశం, కౌన్సిలర్ రాచకొండ సునీల్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-565తో మూడు వేల మందికి అన్యాయం

- ఫీల్డ్ ఎంక్వైరీ లేకుండానే మూడో అలైన్‌మెంట్ అమలుకు చర్యలు
- అడ్డుకొని న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్లకు విన్నవించిన బాధితులు
- ఎవరికీ అన్యాయం జరుగనివ్వనని హామీ ఇచ్చిన భూపాల్‌రెడ్డి

బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 19 : జాతీయ రహదారి-565 విస్తరణలో భాగంగా ఫీల్డ్ ఎంక్వైరీ లేకుండా పేపర్ ద్వారా రూపొందించిన మూడో అలైన్‌మెంట్‌తో మూడు వేల మందికి అన్యాయం జరుగుతుందని నేషనల్ హైవేలో ప్లాట్లు, ఇండ్లు కోల్పోతున్న బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆదుకోవాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిని బుధవారం ఆశ్రయించారు. నల్లగొండ వీటీ కాలనీలోని తన కార్యాలయంలో బాధితులతో కూర్చొని వారి ఆవేదన విన్నారు. ఈ సందర్భంగా బాధితులు మూడో అలైన్‌మెంట్ కాపీనీ కంచర్లకు చూపించి దీన్ని ఆపాలని కోరారు. మొదటి, రెండో అలైన్‌మెంట్లను పక్కకు పెట్టి కొందరి ప్రయోజనాల కోసం మూడో అలైన్‌మెంట్ సృష్టించి అమలు చేస్తున్నారని తెలిపారు. మూడో అలైన్‌మెంట్ అమలైతే మూడు వేల మందికి సంబంధించిన ప్లాట్లు, ఇండ్లు కోల్పోతారని తెలిపారు. ఒక్కొక్కరి ఆవేదన విన్న కంచర్ల గతంలో రూపొందించిన మొదటి లేదా రెండో అలైన్‌మెంట్ మాత్రమే అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని, నల్లగొండ వేదికగా జరిగే ఉద్యమంలో బాధితులు పాత్రధారులు కావాలని పిలుపునివ్వగా అందరూ అంగీకరించారు.

కోమటిరెడ్డి అనుచరుల కోసమే మార్పు..

ఎన్‌హెచ్-565 విస్తరణలో ఎవరూ నష్టపోవద్దనే ఉద్దేశంతో గతంలో రెండు అలైన్‌మెంట్లు సిద్ధం చేస్తే దాన్ని పక్కకు పెట్టిన మంత్రి కోమటిరెడ్డి వారి అనుచరుల భూముల విలువ పెంచడానికి మూడో అలైన్‌మెంట్ తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. పానగల్ బ్రిడ్జి నుంచి దుప్పలపల్లి, అన్నారం ద్వారా ఎస్ఎల్‌బీసీ వరకు అలైన్‌మెంట్ చేయడం వల్ల అక్కడ ఉన్న రైతుల భూమి కొంచెం పోతే వారి భూములకు విలువ పెరుగుతుందని ఆలోచనతో నాడు ఆ అలైన్‌మెంట్ చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం దానిని పక్కన పెట్టి కోమటిరెడ్డి మూడో అలైన్ మెంట్ చేయిస్తున్నారని, దాన్ని అడ్డుకుంటామని చెప్పారు. త్వరలో నిర్వహించబోయే పోరాటానికి బాధితులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, బీఆర్ఎస్ కనగల్ మండలాధ్యక్షుడు ఐతగోని యాదయ్య, నాయకులు దోనాల నాగార్జునరెడ్డి, కందిమల్ల వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

రామానంద తీర్థల